# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com

సంపుటి : 3 సంచిక : 308 గురువారం 26 మార్చి 2026 పేజీలు : 8 వెల : 5/-
Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



# బంకులు.. బారులు

## పెట్రోల్ కొరత భయంతో బంకుల వద్ద వాహనదారుల బారులు

- కొన్నిచోట్ల యాజమాన్యాల 'నో స్టాక్' బోర్డులు
- పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన
- సోషల్ మీడియాలో వార్తలు, వదంతులతో కలవరం
- కిక్కిరిసిన బంకుల్లో పడిగాపులు
- అవసరం లేకున్నా ట్యాంకులు నింపుకుంటున్న వైనం
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్‌లు
- 'నో క్రెడిట్', 'అడ్వాన్స్ పేమెంట్' పద్ధతితో కొన్ని బంకులు మూత

**హైదరాబాద్**

ఇంధనం సెగ రాష్ట్రంలోని వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఆయిల్ కొరత వార్తలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అయితే దేశంలో ఎక్కడా చమురు కొరత లేదని కేంద్రం స్పష్టం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే విషయం పదేపదే చెబుతోంది. ఆయిల్ కంపెనీలు సైతం సరిపడా డీజిల్, పెట్రోల్ నిల్వలు న్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటనలిస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. హైదరాబాద్ మహానగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గత రెండు మూడురోజులుగా పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులుతీరి కన్పిస్తున్నారు. గంటలకొద్దీ పడిగాపులు పడుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు కిక్కిరిసి ఉంటున్నాయి. కొన్ని బంకులు నిరాటంకంగా పని చేస్తుంటే.. కొన్నిచోట్ల మాత్రం బంకుల వద్ద నో స్టాక్ - మిగతా3లో

**ప్రభుత్వం ఏం చెబుతోంది..**

- చమురు కొరత లేదు, పుష్కలంగా నిల్వలు, నిరాటంకంగా సరఫరా: ప్రభుత్వం
- 2 కోట్ల లీటర్ల పెట్రోల్ అందుబాటులో ఉంది: పౌరసరఫరాల శాఖ
- హైదరాబాద్‌లో సరిపడా నిల్వలు
- కంపెనీలు, డీలర్లదీ అదే మాట
- అయినా పట్టించుకోని ప్రజలు.. నో స్టాక్ బోర్డులతో బెంబేలు



## పాకిస్థాన్‌లాగా భారత్ బ్రోకర్ కంట్రీ కాదు

- జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు
- అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమన్న పాకిస్థాన్
- పాక్ దళారీ దేశమని జైశంకర్ విమర్శ


2



## మోడిఫైడ్ ఉడాన్

- దేశంలో 100 కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మాణం
- కేంద్ర కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు
- టైర్ -2, టైర్ - 3 నగరాల కోసం మోడిఫైడ్ ఉడాన్
- 100 కొత్త ఎయిర్‌పోర్టులు, 200 ఆధునిక హెలిప్యాడ్‌ల నిర్మాణం
- టూరిజం, వాణిజ్యాన్ని పెంచడమే లక్ష్యం

# ఎవరో ఎందుకు? నువ్వే పోటీ చెయ్!



- సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి నాపై పోటీచేయాలని ఆహ్వానిస్తున్నా
- తలకిందులుగా తపస్సు చేసినా రేవంత్ మళ్లీ సీఎం కాలేడు
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలిచేది బీఆర్ఎస్సే, సీఎం కేసీఆరే
- నియోజకవర్గాల పునర్విభజన,మహిళా రిజర్వేషన్లతో మాకు లాభమే
- బీఆర్ఎస్‌లో జీవన్‌రెడ్డి చేరికపై వేచిచూడండి..

**హైదరాబాద్**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటలో పోటీ చేసి గెలిచే వారికి మంత్రి పదవి ఇస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై శాసన సభలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పందించారు. 'ఎవరో ఎందుకు.. నువ్వే పోటీచెయ్.. సిద్దిపేటలో నా మీద పోటీ చేయాల్సిందిగా రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నా'అని వ్యాఖ్యానించారు. రేవంత్ తలకిందులుగా తపస్సు చేసినా తిరిగి సీఎం కాలేడన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, కేసీఆర్ సీఎం అవుతారని జోస్యం చెప్పారు. రేవంత్ పనితనం చూసి - మిగతా3లో



## పేదోడి ఇంటి కల నిజం చేసింది వైఎస్సార్

- ఆయన హయాంలోనే 21 లక్షల ఇళ్లు : మంత్రి పొంగులేటి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంప్రతిష్టాత్మకం... ఏప్రిల్ మొదటి వారంలో 1.12 లక్షల ఇళ్లిస్తాం
- రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక... స్థానికసర్పంచ్‌లకూ పూర్తి అధికారం
- ఇళ్లలో ఉండకుంటే ఇతరులకు కేటాయింపు... ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్

3లో



## ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపుపై మమత ఫైర్

- ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు!
- బీజేపీ, ఈసీ కుమ్మక్కు అయ్యాయి
- ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడంపై మమతా బెనర్జీ ఫైర్?

# కూటమి ప్రభుత్వానికి ఓటమి తప్పదు

- అసెంబ్లీ, పార్లమెంటు సీట్ల పెంపు గుడ్‌న్యూస్
- రాష్ట్రంలో కావాలనే భూవివాదాన్ని సృష్టిస్తున్నారు
- గిట్టుబాటు ధరల్లేక రైతుల, వ్యవసాయం విలవిల
- అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ నాయకుల సమావేశంలో మాజీ సీఎం జగన్‌మోహన్



**తాడేపల్లి**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ఓటమి తప్పదు అని మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలతో బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. చంద్రబాబు ఏకంగా క్రెడిట్ దోపిడి చేస్తున్నారని, ఆ దిశలోనే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ కంపెనీ తామే తెచ్చినట్లు బిల్డప్ ఇస్తూ - మిగతా3లో




## రాజధాని అమరావతికి చట్టబద్ధత


- కేంద్ర కేబినెట్ తీర్మానానికి రంగం సిద్ధం
- ఈ నెల 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే విషయంలో కేంద్ర కేబినెట్ త్వరలో నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు తీర్మానానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా చట్టపరమైన ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం జాగ్రత్తలు తీసుకుంటోంది. అందుకు గాను సీఆర్డీఏ--2014 తీర్మానాన్ని - మిగతా3లో

# విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గాల్సిందే

- యూనిట్ రూ.4కు రావాలి : సీఎం చంద్రబాబు
- గత ఏడాది సమర్థ నిర్వహణతో రూ.339 కోట్లు ఆదా
- రాబోయే రోజుల్లో విద్యుత్ రంగం గేమ్ ఛేంజర్ కానుంది
- విద్యుత్ రంగంపై సమీక్షలో సీఎం చంద్రబాబు



**హైదరాబాద్**

విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించడంపై సమగ్రంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఈ దిశగా చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. సచివాలయంలో విద్యుత్ రంగంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యుత్ కొనుగోలు యూనిట్ వ్యయాన్ని రూ.4కు తగ్గించేలా, అదే సమయంలో ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపకుండానే విద్యుత్ సంస్థలు తమ రుణాలను తిరిగి చెల్లించేలా ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతికత, ఆవిష్కరణల వినియోగంతో పొదుపు చర్యలు చేపట్టాలి అన్నారు. సమర్థవంతమైన నిర్వహణ కారణంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో - మిగతా3లో

# ‘మోడిఫైడ్ ఉడాన్’

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రాంతీయ అనుసంధాన పథకం – మోడిఫైడ్ ఉడాన్‌ను ప్రారంభించే ప్రతిపాదనకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. 2026–2027 ఆర్థిక సంవత్సరం నుంచి 2035–2036 వరకు పదేళ్ల పాటు రూ. 28,840 కోట్ల వ్యయంతో ఈ స్కీంను అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది. ఈ స్కీంకు కేంద్ర ప్రభుత్వమే నిధులను సమకూర్చనుంది. కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాల వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, దేశంలో విమాన సర్వీసులు తక్కువగా ఉన్న, పూర్తిగా విమాన సర్వీసులు లేని పలు నగరాల్లో మోడిఫైడ్ ఉడాన్ పథకం ద్వారా విమాన సర్వీసులను అందుబాటులోకి తేనున్నారు. ఇక ఇదే సమయంలో సాధారణ పౌరుల విమాన ప్రయాణ ఛార్జీలను వీలైనంత తక్కువగా ఉంచేందుకు ఈ స్కీం ద్వారా తోడ్పాటును అందించనున్నారు.

ఇమిగ్రేషన్, వీసా, ఫారినర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్ స్కీం అమలును మరో ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ స్కీం ద్వారా ఇమిగ్రేషన్, వీసా జారీ, భారత్‌లోని విదేశీయుల రిజిస్ట్రేషన్‌లతో ముడిపడిన ప్రక్రియలను అత్యాధునిక టెక్నాలజీతో పరస్పరం అనుసంధానిస్తారు. ఉడాన్ స్కీంను మళ్లీ 2026 ఏప్రిల్ 1 నుంచి 2031 మార్చి 31 వరకు అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం రాబోయే ఐదేళ్లలో రూ. 1,800 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

**ఉడాన్ స్కీం అమలును అందుకోసమే పొడిగించాం**

ఉడాన్’ స్కీం అమలు గడువును పొడిగించడం అనేది కేవలం సాంకేతికమైన అప్‌గ్రేడ్ కాదు. వాస్తవానికి అదొక వ్యూహాత్మక మార్పు. భారత పర్యటనకు వచ్చే విదేశీయుల కోసం ప్రపంచ స్థాయి ఇమిగ్రేషన్, వీసా జారీ వ్యవస్థలను అందుబాటులోకి తేవాలనే విజన్ మా ప్రభుత్వానికి ఉంది. ఇటీవలే ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ – 2025 ఆమోదం పొందినందున దాని నియమాలు, మార్గదర్శకాల ప్రకారం వెంటనే ×ఎఖీ=ు వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడింది. ప్రస్తుత అవసరాలు, వలసల నియంత్రణతో ముడిపడిన భవిష్యత్ సవాళ్లు, దేశంలోని విదేశీయుల నిర్వహణ, అక్రమ వలసల కట్టడి వంటి వాటి కోసం ×ఎఖీ=ు వ్యవస్థ



ఉపయోగపడుతుంది” అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

**టైర్ -2, టైర్ – 3 నగరాల కోసం మోడిఫైడ్ ఉడాన్**

ప్రతిష్ఠాత్మకమైన మోడిఫైడ్ ఉడాన్ స్కీం పేరులోని ఖణాూచీ అంటే ‘ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్’ (దేశపు సామాన్య పౌరుడూ ఎగరాలి) అని అర్థం. ఈ స్కీంనే ఉడాన్ 2.0 అని కూడా పిలుస్తారు. దీని ద్వారా రాబోయే పదేళ్లలో రూ. 28,840 కోట్లతో దేశవ్యాప్తంగా ఎంపిక చేసే నగరాల్లో 100 కొత్త ఎయిర్‌పోర్టులను, 200 ఆధునిక హెలిప్యాడ్‌లను నిర్మిస్తారు. ఈ పథకం కోసం టైర్ -2, టైర్ – 3 నగరాలు, కొండ ప్రాంతాలు, మారుమూల నగరాలు, పర్యాటక ప్రదేశాలు, వాణిజ్య ప్రదేశాలకు ఎక్కువ ప్రయారిటీ ఇస్తారు. ఆయా నగరాల నుంచి సామాన్య ప్రజలు వీలైనంత తక్కువ ఛార్జీతో విమాన ప్రయాణం చేసే ఏర్పాట్లు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

**100 కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి రూ. 12,159 కోట్లు**

“మా ప్రభుత్వం 2047 వికసిత భారత్ లక్ష్యంతో పనిచేస్తోంది. దేశంలో వాణిజ్యం, టూరిజాన్ని మరింత పెంచే లక్ష్యంతోనే మోడిఫైడ్ ఉడాన్ స్కీంను ప్రకటించాం. ప్రాంతీయ విమానయాన సర్వీసులు పెరిగితే విపత్తు స్పందన సేవలు, అత్యవసర వైద్య సేవలు టైర్ -2, టైర్-3 నగరాలు, కొండ ప్రాంతాల ప్రజలకు ఇంకా చేరువ అవుతాయి. దీనివల్ల ప్రాంతీయ విమాన సర్వీసులకు, విమానయాన సంస్థలకు లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుతం వినియోగంలో లేని ఎయిర్ స్ట్రిప్‌లను కూడా ఈ స్కీం ద్వారా తిరిగి వినియోగంలోకి తెస్తాం. 100 కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణ పనుల కోసం రాబోయే 8 ఏళ్లలో రూ. 12,159 కోట్లు ఖర్చు చేస్తాం. తద్వారా అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విమానయాన వ్యవస్థ మన దేశంలోనూ అందుబాటులోకి వస్తుంది. ఎయిర్‌పోర్టుల నిర్మాణంతో పాటు నిర్వహణ, విమాన సర్వీసుల కార్యకలాపాలకూ ఈ స్కీం ద్వారా తోడ్పాటును అందిస్తాం” అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

**విమానయాన సంస్థలకు తొలి మూడేళ్లు ఆర్థికసాయం**

“ప్రాంతీయ విమాన సర్వీసులను నడిపే కంపెనీలకు పెద్దగా లాభాలు రావు. అందుకే వాటికి నిర్వహణ, కార్యకలాపాల విభాగంలో తొలి మూడేళ్ల పాటు ఆర్థికసాయాన్ని అందిస్తాం. ఒక్కో కొత్త ఎయిర్‌పోర్టు పరిధిలో ఒక్కో విమానయాన సంస్థకు ఏటా రూ. 3.06 కోట్ల సాయాన్ని అందిస్తాం. ఇక హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్స్ సేవలను అందించే సంస్థలకు ఏటా రూ. 90 లక్షల సాయాన్ని అందిస్తాం. దీంతోపాటు ప్రాంతీయ విమాన సర్వీసులను అందించే విమానయాన సంస్థలకు రాబోయే పదేళ్ల పాటు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) లభిస్తుంది. వచ్చే పదేళ్ల కోసం రూ. 10,043 కోట్లను కేటాయించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మోడిఫైడ్ ఉడాన్ స్కీంలో భాగంగా దాదాపు 441 ఎయిర్‌పోర్టుల నిర్వహణ, కార్యకలాపాలకు సాయం చేయడానికి రూ. 2,577 కోట్లు అవసరమని మేం అంచనా వేశాం. ఇక దేశంలో 200 ఆధునిక హెలిప్యాడ్‌లను నిర్మిస్తాం. ఒక్కో హెలిప్యాడ్ నిర్మాణానికి రూ. 15 కోట్లు ఖర్చవుతాయి. వీటి నిర్మాణ పనుల కోసం రాబోయే 8 ఏళ్లలో రూ. 3,661 కోట్లను ఖర్చు చేస్తాం” అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. “చిన్న విమానాల కొరతను తీర్చడానికి పవన్ హన్స్ సంస్థ కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నుంచి 2 ధ్రువ్ హెలికాప్టర్లను కొంటాం. అలయన్స్ ఎయిర్ కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నుంచి 2 డార్నియెర్ విమానాలు కొంటాం. కొండ ప్రాంతాలు, మారుమూల ఏరియాల్లో ఆపరేషన్ల కోసం వీటిని వినియోగిస్తాం” అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపుపై మమత ఫైర్

భారత ఎన్నికల సంఘం(ఈసీ), బీజేపీపై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితా నుంచి నిజమైన ఓటర్ల పేర్లను తొలగించడంపై మమతా బెనర్జీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఎన్నికల నిష్పాక్షికత, పారదర్శకతపై అనుమానాలు కలిగిస్తోందని అన్నారు. ‘నిజమైన ఓటర్ల పేర్లు ఎన్నికల జాబితా నుంచి తొలగించారనే తీవ్ర సందేహాలు ఉన్నాయి. ఇది ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షిత, పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అదే సమయంలో గుర్తింపు, పౌరసత్వంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఎవరు భారతీయ ఓటరుగా గుర్తింపు పొందుతున్నారు? వారిని ఏ ప్రమాణాల ఆధారంగా గుర్తిస్తున్నారు? ఈ అంశంపై బీజేపీ స్పందించాల్సిన అవసరం ఉంది. అలాగే కేంద్ర ప్రభుత్వం డిటెన్షన్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చూస్తోంది. నేను ఎప్పటికీ దాన్ని అనుమతించను. నా తర్వాత వచ్చే వారు కూడా అనుమతించరు’ అని మమతా బెనర్జీ పేర్కొన్నారు.

**అనుబంధ ఓటర్ల జాబితాలపై సందేహాలు**

అంతకుముందు కూడా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్? (ఎస్?ఐఆర్??) ప్రక్రియపై కూడా మమతా బెనర్జీ విమర్శలు చేశారు. ఈసీ, బీజేపీలు కలిసి ప్రజల ఓటు హక్కులను తొలగించే ప్రయత్నం చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఈసీ అధికారిక పత్రంపై బీజేపీ గుర్తు కనిపిస్తోందని అన్నారు. ఇది కేవలం కేరళకే కాకుండా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. దీనిని



మానవతప్పిదం అని చెప్పి తప్పించుకోలేరని అన్నారు. అదనంగా, అనుబంధ ఓటర్ల జాబితాలు బ్లాక్, జిల్లా స్థాయిలో అందుబాటులో లేవని మమతా బెనర్జీ ఆరోపించారు. ఎస్?ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన మరణాల సంఖ్య 200 దాటిందని పేర్కొన్నారు. ఇప్పుడు నిజం బయటపడిందని, జాబితాలు రాత్రివేళ ప్రచురించడం ఎందుకు? అని ప్రశ్నించారు. ఇంకా బ్లాక్, జిల్లా స్థాయిలో జాబితాలు ఉంచలేదని తెలిపారు. ప్రజలకు తమ ఓటు స్థితి తెలియడం లేదని అన్నారు. తాజాగా ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.

**సుప్రీంకోర్టు జోక్యంతో జాబితాలో పేర్లు– కానీ పారదర్శకత లోపం**

సుప్రీంకోర్టు జోక్యం తర్వాత కొంతమంది పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చినప్పటికీ, మొత్తం ప్రక్రియ పారదర్శకంగా లేదని మమతా బెనర్జీ విమర్శించారు. తాము సుప్రీం కోర్టులో వేసిన కేసు వల్లే కొన్ని పేర్లు జాబితాలో చేర్చినట్లు చెప్పారు. అయితే పూర్తి జాబితాను స్పష్టంగా ప్రకటించడంపై ఈసీ ఎందుకు వెనకడుగు వేస్తోందని అని ప్రశ్నించారు. జాబితాను ప్రచురించడానికి ఈసీకి 6–7 రోజులు ఎందుకు పట్టింది? ఆ సమయంలో ఒక ప్రత్యేక పార్టీకి చెందిన ఓటర్లను చేర్చారా? పూర్తి జాబితా వెలువడితేనే నిజాలు బయటపడతాయని అన్నారు.

**ఎన్నికల ముందు ఐక్యతకు పిలుపు**

త్వరలో బంగాల్? అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో, ఒక పార్టీ (బీజేపీ) ఆధిపత్యంకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా నిలవాలని మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. కేంద్ర సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ, ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, న్యాయంగా కొనసాగేందుకు ఈ ఐక్యత అవసరమని ఆమె స్పష్టం చేశారు. బంగాల్ అసెంబ్లీలో 294 స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఇక ఇటీవల ఎస్?ఐఆర్? ప్రక్రియ తర్వాత బంగాల్?లో తొలి సప్లిమెంటరీ ఓటర్ల జాబితాను ఈసీ విడుదల చేసింది. ఇందులో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను పొందుపరిచారు. ఈ జాబితాను ఈసీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## 1500 ఏళ్ల నాటి ఐరన్ పరిశ్రమ అవశేషాలు లభ్యం

# అప్పట్లోనే అఫ్గానిస్థాన్‌కు ఎగుమతులు!

1500 ఏళ్ల నాటి పురాతన ఇనుప పరిశ్రమ అవశేషాలను కనిపెట్టారు పరిశోధకులు. ఒడిశా సంబల్?పుర్? జిల్లాలోని రౌఢాఖోల్, బేత్?గఢ్?, లౌపాంక్? గ్రామాల పరిధిలో వీటిని గుర్తించారు. ఈ ప్రాంతంలో జరిపిన సర్వేలో పురాతన ఇనుప పరిశ్రమకు చెందిన సుమారు 20 అవశేషాలను కనుగొన్నారు. సంబల్?పుర్?లోని గంగాధర్ మెహర్ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగం నిర్వహించిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. చరిత్ర విభాగాధిపతి, పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ అతుల్ కుమార్ ప్రధాన్ ఆధ్వర్యంలో ఈ పరిశోధనలు చేపట్టారు. ప్రస్తుతం సంబల్?పుర్? జిల్లాలోని రౌఢాఖోల్‌లోని భీమ్మండల్‌లో భారత పురావస్తు శాఖ (ఏఎస్?ఐ) ఆధ్వర్యంలో తవ్వకాలు జరుగుతున్నాయి.

“రౌఢాఖోల్‌లోని లౌపంక్, బెత్‌గఢ్ ప్రాంతాల్లో ఒక పురాతన ఇనుప పరిశ్రమ కర్మాగారం అవశేషాలను కనిపెట్టాము. దీనిని ఆధారంగా ఈ ప్రాంత ప్రజలు ఇనుము తయారీలో నైపుణ్యం కలిగి ఉన్నట్లు అర్థమవుతోంది. ఒకప్పుడు ఈ ప్రాంతం ఇనుప ఖనిజంతో సమృద్ధిగా ఉండేది. ఇక్కడి ప్రజలు ఇనుము తయారీలో నిపుణులు. వారు సంప్రదాయ పద్ధతిలో ఇనుప ఖనిజాన్ని వేడి చేసి కరిగించి ఇనుమును ఉత్పత్తి చేసేవారు. ఇక్కడ పరిశోధన చేయగా ఇనుముతో పాటు ఇనుము తయారీ సమయంలో లభించే వ్యర్థ పదార్థాలు లభించాయి.”

**దేశంతో పాటు అఫ్గానిస్థాన్? లాంటి విదేశాలకు ఎగుమతి**



రౌఢాఖోల్ రాజుల కాలం నాటి పత్రాల నుంచి తాము చాలా విషయాలు తెలుసుకున్నామని పరిశోధకులు డాక్టర్ అతుల్ కుమార్ ప్రధాన్ చెప్పారు. ఈ ప్రాంతంలోని ఇనుము అత్యుత్తమ నాణ్యతతో ఉండేదని, దీనికి చాలా గిరాకీ ఉండేదని వివరించారు. ఈ ప్రాంతంలో ఉత్పత్తి అయిన ఇనుమును దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు ఆఫ్గానిస్థాన్?తో సహా మరికొన్ని దేశాలకు ఎగుమతి అయినట్లు రికార్డుల్లో ఉందన్నారు.

**కార్బన్ డేటింగ్ చేస్తే 2000 ఏళ్ల నాటిదనే తేలే అవకాశం**

“ఇప్పటికే మేము చేపట్టిన ప్రాథమిక అధ్యయనంలో ఇది 1000 సంవత్సరాల నాటిదని తేలింది. కానీ దీనిని తవ్వి కార్బన్ డేటింగ్ చేస్తే సుమారు 2000 సంవత్సరాల నాటిదని రుజువవుతుంది. ఈ ప్రాంత ప్రజలు ఇనుప ఖనిజాన్ని రాయితో కొట్టి, దాని లోహపు శబ్దం ద్వారా దాని నాణ్యతను గుర్తించేవారు. ఇనుముతో వివిధ పనిముట్లు, చేతి ఆయుధాలు తయారు చేసేవారు.” అని పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ అతుల్ కుమార్ ప్రధాన్ అన్నారు. రౌఢాఖోల్ పురాతన కోటలో తవ్వకాలకు భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఇప్పటికే అనుమతి ఇచ్చిందని డాక్టర్ అతుల్ కుమార్ ప్రధాన్ చెప్పారు. అయితే మరిన్ని తవ్వకాల కోసం ఏఎస్ఐకి దరఖాస్తు చేసుకుంటామని తెలిపారు. ఇప్పటికే రౌఢాఖోల్‌లోని భీమ్మండల్‌లో పురావస్తు శాఖ పరిశోధనలు జరుగుతుండగా, బెత్‌గఢ్, లౌపంక్ పంచాయతీ పరిధిలో ఈ పురాతన ఇనుము పరిశ్రమ అవశేషాలను కనుగొన్నారు. “ఈ ప్రాంత ప్రజలు పెద్ద కొలిమిల్లో హెమటైట్ రాళ్లను వేడి చేసి వాటిని కరిగించి నాణ్యమైన ఇనుము, ఇనుప ఖనిజాన్ని వేరు చేయడంలో నిపుణులు. దీనిపై పరిశోధన చేయడం ద్వారా ఈ ఇనుప కళ ఎంత పురాతనమైనదో కచ్చితమైన సమాచారాన్ని పొందేందుకు ప్రయత్నిస్తాం. ఇక్కడ ట్రక్కుల పరిమాణం లాంటి పెద్ద కొలిమిలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, ఈ ప్రాంతంలోని ఐరన్ పంచాయత్ వంటి అనేక గ్రామాల పేర్లు ఇనుముతో ముడిపడి ఉన్నాయి” అని అతుల్ కుమార్ ప్రధాన్ తెలిపారు.

## ‘పాకిస్థాన్‌లాగా భారత్ బ్రోకర్ కంట్రీ కాదు’



అమెరికా–ఇరాన్ కాల్పుల విరమణ చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమన్న పాకిస్థాన్‌పై భారత విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌ను ఒక దళారీ దేశంగా అభివర్ణించారు. అఖిలపక్ష సమావేశం అనంతరం మాట్లాడిన ఆయన పాక్ మాదిరి దళారీ దేశంగా భారత్ ప్రవర్తించదని స్పష్టంచేశారు. పాక్ చేస్తున్న ప్రయత్నాల్లో కొత్తేమీ లేదని అభిప్రాయపడ్డారు. 1981 నుంచి పాకిస్థాన్‌ను అమెరికా ఉపయోగించుకుంటుందన్నారు. భారత్ తన సొంత ప్రయోజనాలను కాపాడుకుంటూనే చర్చలు, దౌత్యం ద్వారా సమస్యల పరిష్కారానికి మొగ్గు చూపుతుందని, ఎవరికో మధ్యవర్తిగా పనిచేయడం తమ విధానం కాదని జైశంకర్ పేర్కొన్నారు. అంతకు ముందు, అమెరికా, ఇరాన్ మధ్య అర్థవంతమైన, వాస్తవికమైన చర్చలను నిర్వహించేందుకు తాము సిద్ధమని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. పశ్చిమాసియా యుద్ధాన్ని ఆపే ఈ సంప్రదింపులను నిర్వహించే అవకాశం లభిస్తే, దాన్నొక గౌరవంగా భావిస్తామని ఆయన వెల్లడించారు. అమెరికా, ఇరాన్‌ల వైపు నుంచి ఉమ్మడి అంగీకారం లభిస్తే చర్చలకు మధ్యవర్తిగా వ్యవహరించేందుకు పాక్ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు, పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతల పరిరక్షణకు ప్రస్తుతం జరుగుతున్న అన్ని ప్రయత్నాలను పాకిస్థాన్ స్వాగతిస్తుందని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ట్వీట్ చేశారు.

**మధ్యవర్తులుగా పాక్, తుర్కియే, ఈజిప్ట్**

రహస్యంగా జరుగుతున్న అమెరికా, ఇరాన్ శాంతి చర్చలకు పాకిస్థాన్, తుర్కియే, ఈజిప్ట్ మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి అంటూ ఇటీవలే మీడియాలో కథనాలు వచ్చాయి. ఇప్పుడు పాక్ ప్రధాని చేసిన ప్రకటన, ఆ కథనాలకు బలం చేకూర్చేలా ఉందని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు అంటున్నారు.

శాంతి చర్చలకు వేదికగా పాకిస్థాన్

అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు వేదికగా పాకిస్థాన్‌ను ఎంపిక చేస్తారంటూ పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. అయితే ఈ ఊహాగానాలను నమ్మొద్దని, అధికారిక ప్రకటనలు వెలువడే వరకు వేచి చూడాలని మీడియాకు పాకిస్థాన్ విదేశాంగ శాఖ సూచించింది. దౌత్యం, చర్చల ద్వారానే పశ్చిమాసియా సైనిక ఘర్షణను ఆపగలుగుతామని పేర్కొంది.

# పాకిస్థాన్‌కు గూఢచర్యం

**ముఠాలో మరో ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు**

**పాకిస్థాన్‌కు రహస్య సమాచారం పంపిన గ్యాంగ్‌పై పోలీసుల ఫోకస్**

**మరో ముగ్గురు అరెస్ట్‌తో మొత్తం 21కి చేరిన నిందితులు**

**ప్రతి సమాచారానికి రూ. 5,000 చెల్లింపులు**



పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్న ఓ ముఠాను ఇటీవల ఉత్తర్?ప్రదేశ్? పోలీసులు గుర్తించి, అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఆ కేసులో మరో ముగ్గురిని ఘాజియాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 21కి చేరిందని అధికారులు తెలిపారు. మార్చి 13న మొదటిసారిగా ఈ రాకెట్‌ను ఛేదించిన ఘాజియాబాద్ పోలీసులు, అప్పటి నుంచి ఈ నెట్‌వర్క్‌లోని ఒక్కొక్కరిని అరెస్టు చేస్తున్నారు. త్జజాగా అరెస్టయిన వారిలో బిహార్‌లోని భాగల్‌పూర్‌కు చెందిన సమీర్ అలియాస్ షూటర్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ గూఢచర్యంలో ఇతను ప్రధాన పాత్రధారిగా గుర్తించారు. సమీర్ ప్రస్తుతం దిల్లీలో నివసిస్తున్నాడు. భారత్?లోని కీలక సమాచారాన్ని పాక్ హ్యాండ్లర్లకు సమాచారం అందించడంలో సమీర్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమీర్?తో పాటు షామ్లీకి చెందిన సమీర్, షాజహాన్‌పూర్‌కు చెందిన శివరాజ్‌లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసును నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) కూడా విచారిస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఘాజియాబాద్ పోలీసులు ఇప్పటికే ఈ కేసుపై జిల్లా కోర్టులో చార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారు.

**పాకిస్థాన్‌కు రహస్య సమాచారం చేరవేత**

ఈ గూఢచారి రాకెట్‌ను పాకిస్థాన్ నుంచి సర్దార్ అలియాస్ జోరావర్ సింగ్ అనే వ్యక్తి నడుపుతున్నట్లు అదనపు పోలీస్ కమిషనర్ రాజ్ కరణ్ నాయర్ తెలిపారు. భారత్‌లో ఉన్న నిందితులు సోషల్ మీడియా వేదికల ద్వారా సర్దార్‌తో నిరంతరం టచ్‌లో ఉండేవారని వెల్లడించారు. ఇక్కడ సేకరించిన ఫోటోలు, వీడియోలు, భద్రతా బలగాల కదలికలను ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌కు పంపినట్లు చెప్పారు. ఈ ముఠాను భారత్‌లో సుహైల్ అలియాస్ రోమియో అనే వ్యక్తి నడిపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రోమియో ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ నివాసి. ఇతని కింద పలువురు పనిచేస్తున్నారు. హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన నౌషాద్ అలీ దిల్లీలోని పోలీస్ ఇన్స్టాలేషన్లు, రైల్వే స్టేషన్ల వద్ద రెక్కీ నిర్వహించేవాడు. ఈయన ఫరీదాబాద్‌లోనే ఉంటూ కీలక ప్రాంతాల వీడియోలను పాకిస్థాన్‌కు పంపేవాడు. మథురకు చెందిన మీరా ఠాకూర్ సోషల్ మీడియా ద్వారా సుహైల్?కు పరిచయమైంది. 2025లో ఈమె ఆయుధాల అక్రమ రవాణా కేసులో దిల్లీ స్పెషల్ సెల్ చేతికి చిక్కింది. తాను ముంబై పోలీసులకు ఇన్ఫార్మర్‌గా పనిచేస్తున్నానని నమ్మబలుకుతూ ఈ గూఢచారి కార్యకలాపాలు సాగించేది. సుహేల్ మాలిక్, ప్రవీణ్, రాజ్ వాల్మీకి, శివ వాల్మీకి, రితిక్ గంగ్వార్ వంటి వారు ఈ గుఢచర్యంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు అయిన వారిలో ఆరుగురు మైనర్లు ఉన్నారు. దర్యాప్తు సంస్థలకు అనుమానం రాకుండా ఉండేందుకు ఈ ముఠా ఒక వ్యూహాత్మకంగా మైనర్లను తమ టీమ్?లోకి రిక్రూట్ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తక్కువ చదువుకున్న, పేదరికంలో ఉన్న హిందూ మైనర్ బాలురను తమ నెట్‌వర్క్‌లోకి చేర్చుకోవాలని పాక్?లోని ఆర్గనైజర్ చెప్పడంతో వారినే రిక్రూట్ చేసుకున్నారు. దిల్లీలోని కాంటోన్మెంట్ రైల్వే స్టేషన్ వంటి అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో సోలార్‌తో పనిచేసే సీసీటీవీ కెమెరాలను రహస్యంగా అమర్చడానికి కూడా ఈ మైనర్లనే ఉపయోగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**ఫొటోకు రూ. 5000**

ఈ గూఢచారి ముఠాకు నిధులు ఎలా వచ్చేవి అన్నకోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ నుంచి పంజాబ్ సరిహద్దుల మీదుగా నిధులు భారత్‌లోకి వచ్చేవని గుర్తించారు. బ్యాంకు అకౌంట్ల ద్వారా లావాదేవీలు జరిగితే పట్టుబడతామనే భయంతో చిన్న చిన్న కిరాణా షాపులు, మనీ ట్రాన్స్‌ఫర్ సెంటర్ల అకౌంట్లను వీరు వాడుకున్నట్లు పోలీసులు తెలిపారు. పాక్?లోని హ్యాండర్లు భారత్?లోని ముఠాకు ఒక్కో సమాచారం లేదా ఫొటోకు 5,000 వరకు ఇచ్చేవారిని పోలీసులు గుర్తించారు. ఒకేసారి పెద్ద మొత్తాన్ని పంపితే అనుమానం వస్తుందని, వ్యూహాత్మంగా చిన్న మొత్తంలో పంపినట్లు భారత్?లోని ముఠాకు పాక్? హ్యాండ్లర్లు పంపినట్లు విచారణలో తేలింది.

# బంకులు.. బారులు

-మొదటిపేజీ తరువాయి

బోర్డులు కన్పిస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం, చమురు, సహజ వాయువుల కొరత వార్తల నేపథ్యంలో ఈ నో స్టాక్ బోర్డులు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాహనదారులు అవసరం ఉన్నా, లేకపోయినా డీజిల్, పెట్రోల్ ట్యాంక్ నిండా నింపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా ఏరోజు కారోజు ఇంధనం నింపుకునే క్యాబ్ డ్రైవర్లు, ఇతర గిగ్ వర్కర్లు, సామాన్య ప్రజలు కూడా ఎంతో కొంత అదనంగా ట్యాంకు నింపుకోవాలని చూస్తుండటంతో తెరిచి ఉన్న బంకుల వద్ద క్యూలు పెరిగిపోతున్నాయి. కొందరు సీసాలు, పెద్దపెద్ద క్యాన్లు, డ్రమ్ముల్లో సైతం ఇంధనం నిల్వ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని బంకులు మూతపడి కన్పిస్తుండటంతో వాహనదారుల్లో ఆందోళన రెట్టింపవుతోంది. బంకులు మూత పడి ఉండటానికి 'నో క్రెడిట్' సమస్య ప్రధాన కారణమని తెలుస్తుండగా..ప్రభుత్వాలు, ఆయిల్ కంపెనీల ప్రకటనలను పట్టించుకోకుండా ప్రజలు ఎక్కడ పెట్రోల్, డీజిల్ దొరుకుతోందో తెలుసుకొని మరీ కొనుగోళ్లు చేస్తుండటంతో తెరిచి ఉన్న బంకులు కిక్కిరిసిపోయి కన్పిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### సోమవారం నుంచే..

పశ్చిమాసియాలో యుద్ధం ఎప్పుడో మొదలైనా..సోమవారం సాయంత్రం నుంచే బంకుల వద్ద డీజిల్, పెట్రోల్ కోసం వాహనదారులు క్యూలు కట్టడం ప్రారంభించారు. ఆ ఫొటోలు టీవీలు, సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో చమురు కొరతపై భయాందోళనలు మొదలయ్యాయి. బంకులన్నీ వాహనదారులతో నిండిపోవడం మొదలయ్యింది. మంగళ, బుధవారాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది.

### భారీగా పెరిగిన డిమాండ్

ఇంధన కంపెనీల లెక్కల ప్రకారం రాష్ట్రంలోని సుమారు 3,600 పెట్రోల్ బంకులకు సాధారణంగా రోజుకు సగటున 13,752 కిలోలీటర్ల ఇంధనం అవసరం ఉంటుంది. తదనుగుణంగా ఆయిల్ కంపెనీలు సగటున 14,729 కిలోలీటర్లు సరఫరా చేసేవి. కానీ ప్రస్తుతం డిమాండ్ ఒక్కసారిగా 17,246 కిలోలీటర్లకు చేరింది. దీనికి అనుగుణంగా ఆయిల్ కంపెనీలు కూడా సరఫరాను 17,898 కిలోలీటర్లకు పెంచినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కానీ ఇప్పటికీ కొన్ని బంకులు నోస్టాక్ బోర్డులతో మూతపడి కన్పిస్తున్నాయి. మరికొన్ని బంకులు వాహనాలతో కిక్కిరిసి ఉంటున్నాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల్లో రెట్టింపు స్థాయిలో పెట్రోల్ విక్రయాలు పెరిగినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెల 22న 3,024 కిలోలీటర్ల ఇంధనం విక్రయాలు జరగ్గా, 23న ఇది రెట్టింపై 6,400 కిలోలీటర్లకు చేరుకుంది.

### వచ్చిన స్టాక్ వచ్చినట్టు ఖాళీ

హైదరాబాద్, రంగారెడ్డితో పాటు మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో కూడా ఇంధనానికి అగచాట్లు ఎదురవుతున్నాయి. పరిశ్రమలు, రవాణా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో డీజిల్ వినియోగం గణనీయంగా పెరిగింది. వినియోగం పెరగడంతో ఉదయం వచ్చిన స్టాక్ అదే రోజు ఖాళీ అవుతోంది. దీంతో పలు పెట్రోల్ బంకులు మధ్యాహ్న?ననికే 'నో స్టాక్' బోర్డులు పెట్టేస్తున్నాయి.

### హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్‌లు

హైదరాబాద్ నగరంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఉదయం నుంచే వాహనదారులు బంకుల వద్దకు చేరుకోవడంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వస్తోంది. ఐటీ కారిడార్‌లోని మాదాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డి?రస్టిక్ట్ ప్రాంతాల్లోని పెట్రోల్ బంకులన్నీ బుధవారం ఉదయం నుంచే వాహనదారులతో నిండిపోగా, ట్రాఫిక్ పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గచ్చిబౌలిలోని ప్యారడైజ్ వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌ను పోలీసులే మూసివేయించినట్లు ఖాన్ అనే వైద్యుడు 'సాక్షి'కి తెలిపారు. కొన్ని బంకుల వద్ద గంటల తరబడి వేచి చూసిన తర్వాత స్టాక్ అయిపోయిందని చెబుతున్న పరిస్థితి ఉంది. దీంతో సాధారణ ప్రజలతో పాటు హైదరాబాద్ నగరంలో వేల సంఖ్యలో ఉన్న ఆన్‌లైన్‌లో ఆహారం, నిత్యావసరాలు, ఇతర వస్తువులు చేరవేసే కార్మికులు, ఉబర్, రాపిడోల వంటి ద్వారా సేవలందించే క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు జిల్లాల్లో సైతం వాహనదారుల్లో ఆందోళన కొనసాగుతోంది.

### క్యాన్లలో పెట్రోల్‌తో ప్రమాదం

డీజిల్, పెట్రోల్ కొరత లేదంటున్న ప్రభుత్వాలు, ఆయిల్ కంపెనీలు..ఈ విషయంతో పాటు వాస్తవ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వారు ఇబ్బందులు పడకుండా చూడాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. క్యాన్లలో పెట్రోల్ పోయవద్దని బంకుల యజమానులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు కూడా కేవలం అవసరమైన మేరకే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, క్యాన్లలో నిల్వ ఉంచుకోవడం ప్రమాదకరం, చట్ట విరుద్ధం అని పేర్కొంటున్నారు.

### నో క్రెడిట్..అడ్వాన్స్ పేమెంట్‌తో అసలు సమస్య!

రాష్ట్రంలో ఇంధనం కొరత లేదని ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. ఇక డీలర్లు కూడా సంక్షోభానికి కారణం కొరత కాదని, ఆయిల్ కంపెనీలు తీసుకొచ్చిన కొత్త నిబంధనలేనని పేర్కొంటుండటం గమనార్హం. వారి కథనం ప్రకారం.. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో.. గతంలో ఉన్న 'క్రెడిట్' సౌకర్యాన్ని రద్దు చేసి, 'అడ్వాన్స్ పేమెంట్' పద్ధతిని అమలు చేస్తుండటంతో బంకుల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు లక్షల్లో పేరుకు పోయిన పాత బకాయిలు కూడా సమస్య తీవ్రతకు కారణమవుతున్నట్లు తెలిసింది. పాత బకాయిలు చెల్లిస్తేనే కొత్త స్టాక్ ఇస్తామన్న కంపెనీల నిబంధనతో పలు బంకులు ఆర్డర్లు ఇవ్వలేకపోతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే బంకులు మూత పడుతున్నాయి. నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇది చూసి తెరిచి ఉన్న బంకులకు వాహనదారులు రెండు, మూడు రెట్ల ఎక్కువ సంఖ్యలో పోటెత్తుతుండటంతో..క్రెడిట్, ఇతర సమస్యల్లేని ఆ బంకుల్లో స్టాక్ గంటల్లోనే ఖాళీ అవుతోంది.

### పెట్రోల్, డీజిల్ కొరత లేదు: పౌరసరఫరాల శాఖ కమిషనర్

'రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదు. రాష్ట్రంలో ఇప్పటికీ సుమారు 20 వేల కిలోలీటర్ల పెట్రోల్ అందుబాటులో ఉంది. సరఫరా వ్యవస్థలో కూడా ఎలాంటి అంతరాయం లేదు. మంగళవారం ఒక్కరోజే 1,500 పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లను పంపించాం. వాహనదారులు అనవసరంగా ఎక్కువ పెట్రోల్ నిల్వ చేసుకోవద్దు..' అని పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని, అవసరం లేకుండా ఆయిల్ కొనుగోలు చేయవద్దని (ప్యానిక్ కొనుగోళ్లు) మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులతో ఇంధన నిల్వలపై సమీక్ష జరిపారు.

### తప్పుడు ప్రచారం నమ్మొద్దు: హైదరాబాద్ సీపీ

'హైదరాబాద్‌లో ఇంధనం కొరత లేదు. తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు. నగరంలో దాదాపు 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. నగర వ్యాప్తంగా చమురు సరఫరా నిరాటంకంగా కొనసాగుతోంది. అవసరానికి మించి కొనుగోలు చేయొద్దు. కేవలం వదంతుల వల్లే రద్దీ ఏర్పడుతోంది..' అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన హెచ్చరించారు. నగరంలో తాజా పరిస్థితిపై బుధవారం టీజీసీసీసీలో వారు సమీక్ష జరిపారు.

### అవసరానికి మించి కొనుగోళ్లతో స్టాక్ ఖాళీ: డీలర్ల సంఘం

'ఇంధన కొరత అంటూ తప్పుడు వార్తలు ప్రచారం చేస్తుండటంతో వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద క్యూలు కడుతున్నారు. మళ్లీ ఆయిల్ దొరుకుతుందో లేదో అని అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్టాక్ త్వరగా అయిపోతోంది. ప్రజలు వదంతులు నమ్మొద్దు. ప్యానిక్ కొనుగోళ్లు నిలిపివేయాలి. కంటైనర్లు, సీసాల్లో కూడా తీసుకోకూడదు..' అని తెలంగాణ పెట్రోలియం డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎం.అమరేందర్‌రెడ్డి సూచించారు. 'పాత బకాయిలు చెల్లిస్తేనే ఆయిల్ కంపెనీలు ఇంధనం సరఫరా చేస్తున్నాయి. క్రెడిట్ (ఉద్దెర)లో పెట్రోల్, డీజిల్ ఇవ్వడం లేదు. ఇది కొన్ని బంకులు మూతపడటానికి, తెరిచి ఉన్నచోట క్యూలు పెరగడానికి కారణమవుతోంది..' అని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు.

# విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే సుమారు రూ.339 కోట్ల మేర ఆదా చేశామని, ఈ తరహా పొదుపు చర్యలను మరింతగా చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇప్పుడు ఈ రంగంలో అనేక మార్పులు వస్తున్నాయని, ప్రపంచం గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ రంగం గేమ్ ఛేంజర్ కానుందన్నారు. ప్రపంచ దేశాలు తక్కువ ఖర్చుతో పర్యావరణహిత ఉత్పత్తికి ఎంతగానో మొగ్గు చూపుతున్నాయని అధికారులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడం వల్లే గూగుల్ వంటి కంపెనీలు ఇక్కడ తమ ఉనికిని చాటుకోగలిగాయని ఆయన పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద రూఫ్?టాఫ్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలని సీఎం అన్నారు."పీఎం కుసుమ్?" పై రైతులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు.

ప్రజలపై భారం వేయకుండా అప్పులు తీర్చేలా: సౌర విద్యుత్ ఉత్పత్తి విషయంలో మన దేశంలోనే మొట్టమొదటి స్థానంలో ఉండేలా చర్యలు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వీటితో పంప్ స్టోరేజీ (హైబ్రిడ్) ప్రాజెక్టులు, పవన



విద్యుత్ (విండ్ ఎనర్జీ), బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం వంటి ప్రాజెక్టులను ఇంటిగ్రేట్ చేసుకోవాలనన్నారు. విద్యుత్ రంగంలోని టెక్నాలజీలను, ఇన్నోవేషన్లను ప్రోత్సహించేందుకు ఎనర్జీ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. విద్యుత్ సంస్థలపై రుణ భారం అత్యధికంగా పెరిగిందని ముఖ్యమంత్రి పేర్కొంటూ, ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం మోపకుండానే సంస్థలే ఈ రుణాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ట్రూ అప్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా చూసేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ఎనర్జీ యూనివర్సిటీని ఏర్పాటు:** సాంకేతికత అందిపుచ్చుకునేందుకు ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ రంగంలో సాంకేతిక పురోగతిని, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఎనర్జీ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. మంచి ఆలోచనలతో ముందుకు వచ్చే స్టార్టప్ సంస్థలకు అవసరమైన 'మార్జిన్ మనీ' మద్దతును అందించేందుకు విద్యుత్ సంస్థలు తగిన చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉద్దేశంతో ఒక "ఇంక్యుబేషన్ ఫండ్"ని ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. 2028–29 నాటికి విద్యుత్ కొనుగోలు యూనిట్ ధరను రూ.4.10కి తగ్గించే దిశగా చర్యలు ప్రారంభించినట్లు అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయనంద్, డిస్కం(విద్యుత్ పంపిణీ సంస్థ)ల సీఎండీలు, విద్యుత్ శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## రాజధాని అమరావతికి చట్టబద్ధత




-మొదటిపేజీ తరువాయి

సవరించాలని ఏపీకి సూచించింది. ఈ సూచన మేరకు ఈ నెల 28న శాసనసభలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ తీర్మానం చేయనున్నారు. ఈ తీర్మానాన్ని ఏపీ ప్రభుత్వం కేంద్రానికి పంపనుంది. 2024 జూన్ 2 నుంచి అమరావతిని రాజధానిగా ప్రకటించాలని గతంలో ఏపీ కోరిన విషయం తెలిసిందే. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే అమరావతిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు - వదంతులు నమ్మొద్దు

పట్టణాల్లో ఎల్పీజీ సిలిండర్ల నుంచి పైప్డ్ నేచురల్ గ్యాస్ సిలిండర్ల వైపు వినియోగదారులను మళ్లించేలా కొత్త పాలసీని తీసుకొస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ విషయమై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. వన్? టైమ్ పాస్‌వర్డ్ ద్వారానే గ్యాస్ సరఫరా జరగాలని, సిలిండర్లు బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదన్న మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రజలు వదంతులు నమ్మి ముందుజాగ్రత్తగా గ్యాస్ బుక్ చేస్తున్నారని తెలిపారు. 2.4 లక్షల గ్యాస్ బుకింగ్స్‌కు 5 లక్షల బుకింగ్స్ అవుతున్నాయని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. వాణిజ్య అవసరాలకు ఇచ్చే గ్యాస్ సరఫరాను కేంద్రం 10 నుంచి 20 శాతం పెంచిందని మంత్రి వెల్లడించారు. వాణిజ్య సిలిండర్లు వాడేవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెస్టారెంట్లు, విద్యాసంస్థలకు సరఫరా పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణాల్లోని ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 2.34 లక్షల మంది పైప్డ్ గ్యాస్ వినియోగించుకుంటున్నారన్న మంత్రి, పట్టణ ప్రాంతాలకు దీని కనెక్టివిటీ అందుబాటులో ఉందని పునరుద్ఘాటించారు. పట్టణాల్లో పైప్డ్ గ్యాస్ ఇంటింటికీ తరలింపునకు మరిన్ని పైపులు వేయాల్సి ఉందన్నారు. సోలార్, ఇండక్షన్ కుకింగ్ స్టౌవ్‌లను వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్ , డీజిల్ కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు 'సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ నివారణకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే సిలిండర్ల అక్రమాలపై 800 కేసులు నమోదయ్యాయి. 3,540 సిలిండర్లు సీజ్ చేశాం. అధిక ధరలకు విక్రయం, బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు. కచ్చితంగా వన్‌టైమ్ పాస్‌వర్డ్ ద్వారానే గ్యాస్ సరఫరా జరపాలి. ఎవరైనా అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే రాష్ట్ర స్థాయి టోల్‌ఫ్రీ నెం.1967 లేదా జిల్లా స్థాయిలో ఫిర్యాదు చేయవచ్చు.' డీలిమిటేషన్‌పై సమగ్ర అధ్యయనం: జనాభా ప్రాతిపదికనే డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతుందన్న మంత్రి దీనిపై త్వరలో పార్టీలో సబ్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కమిటీ ముందు ఉంచాల్సిన అంశాలను తమ పార్టీ తరపున చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. నష్టం ఉందా లేదా అనే అంశంపై అధ్యయనం చేశాకే అభిప్రాయాలు తెలుపుతామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు.

## ఎవరో ఎందుకు? నువ్వే పోటీ చెయ్!

-మొదటిపేజీ తరువాయి

ఓటు వేసేందుకు రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం సిద్ధంగా లేదని దుయ్యబట్టారు. శాసనసభ లాబీలోని ప్రతిపక్ష నేత కార్యాలయంలో హరీశ్‌రావు బుధవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రాజీనామా, బీఆర్ఎస్‌లో చేరికకు సంబంధించి స్పందిస్తూ 'వేచి చూడండి.. కొన్ని చెప్తే బాగుండవు.. చూస్తేనే బాగుంటాయి'అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. 'అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లను స్వాగతిస్తాం. మహిళా రిజర్వేషన్లపై గతంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. దక్షిణాది రాష్ట్రాలపై ఉత్తరాదికి ఎప్పుడూ చిన్నచూపే ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటించి, ప్రగతి దిశగా పనిచేస్తూ నష్టపోతున్నాయి'అని హరీశ్‌రావు చెప్పారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేటు మెంబర్ బిల్లుపై స్పీకర్‌ను మరోమారు కలుస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించేందుకు తాము 15 అంశాలు ప్రతిపాదించినా ఒక్కటీ పరిగణనలోకి తీసుకోలేదని మండిపడ్డారు. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 16 నోటిఫికేషన్ల ద్వారా 50,785 ఉద్యోగాలు నోటిఫై చేసి 16,978 మాత్రమే భర్తీ చేసినట్లు ఒప్పుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 36 సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి తొమ్మిదింటికి మాత్రమే అధ్యక్షులను నియమించింది. 17 బోర్డులకు కనీసం కార్యాలయాలు కూడా లేవు'అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు మరో వారం రోజులు పొడిగించాలని డిమాండ్ చేశారు.

## పేదోడి ఇంటి కల నిజం చేసింది వైఎస్సార్

**హైదరాబాద్:** పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా భావించే సొంతింటి కలను పెద్ద ఎత్తున నిజం చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాసనసభలో స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన హయాంలోనే అత్యధికంగా 21 లక్షల ఇళ్లు పేదలకు కట్టించారని తెలిపారు. తిరిగి తమ ప్రభుత్వమే ఈ స్థాయిలో ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తోందని చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్ తదితరులు లేవనెత్తిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అంశం సుదీర్ఘ చర్చకు దారితీసింది. అధికార, విపక్ష సభ్యులు ఈ అంశంపై పలు ప్రశ్నలు వేశారు. వీటన్నింటికీ మంత్రి పొంగులేటి బదులిచ్చారు. పేదలకు ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని తాము ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని చెప్పారు. 99 రోజుల ప్రణాళికలో దీనికే ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏప్రిల్ మొదటి వారానికి 1.12 లక్షల ఇళ్లు అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామన్నారు. వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణం, పంపిణీ పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2,31,206 ఇళ్లు మంజూరు చేశారని, వీటిల్లో 1,62,936 ఇళ్లు కొన్ని మౌలిక వసతులు మినహా పూర్తయినట్టు తెలిపారు. నాణ్యత విషయంలో వచ్చిన ఆరోపణలపై థర్డ్ పార్టీ విచారణ జరుగుతోందని, నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తున్నామని, దీనిద్వారా వచ్చే సందేహాలను వెంటనే నివృత్తి చేస్తామన్నారు.

### లబ్ధిదారులు నివాసం ఉండడం లేదు

ఇళ్లు కేటాయించినా, చాలాచోట్ల లబ్ధిదారులు నివాసం ఉండడం లేదని మంత్రి తెలిపారు. అధికారులతో దీనిపై ఇటీవల సమీక్షించినట్లు చెప్పారు. దీనిపై 6,500 మందికి నోటీసులిస్తే, 4,500 మంది మాత్రమే స్పందించారని వెల్లడించారు. మరో రెండు నెలల్లో లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లకపోతే, ఆ ఇళ్లను అర్హులైన ఇతరులకు కేటాయిస్తామన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే కేటాయించిన 12 వేల ఇళ్లలోకి లబ్ధిదారులు వెళ్లలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన ఇళ్లను కూడా లబ్ధిదారులకు కేటాయిస్తామని, పాత కాంట్రాక్టర్లు పనులు చేయకపోతే ఇతరులకు అప్పగిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ కమిటీలు వేసినా, ఆ గ్రామ సర్పంచ్, పట్టణాల్లో వార్డు కౌన్సిలర్లకు అధికారాలుంటాయని చెప్పారు. వారి సిఫారసులను కలెక్టర్ పరిశీలిస్తారని, అంతిమంగా ఇన్‌చార్జి మంత్రి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు. బహుళ అంతస్తుల భవనాలు ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రాంతంలో షాపులను అమ్మడం కాకుండా, లీజుకు ఇవ్వాలన్న సభ్యుల ప్రతిపాదనను మంత్రి తోసిపుచ్చారు. లీజుకు తీసుకున్న వ్యక్తి అద్దె కట్టడని, ఖాళీ చేయడని, కొత్త సమస్యలు వస్తాయన్నారు. ఓపెన్ ఆక్షన్ ద్వారా అమ్మేసి, ఆ డబ్బును ఆ కాలనీ అసోసియేషన్, మున్సిపాలిటీ, లేదా గ్రామ పంచాయితీ జాయింట్ అకౌంట్‌లో ఉంచుతామన్నారు. వడ్డీతో అపార్ట్‌మెంట్ నిర్వహణ సాధ్యమవుతుందని చెప్పారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్లపై ప్రజల నుంచి పూర్తి సంతృప్తి వచ్చిందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఇళ్ళ కేటాయింపు, నిర్మాణాలపై శాసనసభ్యులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. మంత్రి పొంగులేటి బదులిస్తున్న సమయంలోనూ 'రివ్యూ కమిటీ పెడుతున్నారా? లేదా?'అంటూ ఆయన ప్రశ్నించారు. త్వరలోనే సమీక్ష చేపడతామని మంత్రి బదులిచ్చారు.

## కూటమి ప్రభుత్వానికి ఓటమి తప్పదు

-మొదటిపేజీ తరువాయి

ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నారు. నిజానికి 2022లో తన దావోస్ పర్యటనలో ఆదిత్య మిట్టల్‌ను కలిశానని, రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై అప్పుడే దాదాపు అవగాహన కుదిరిందని, తగిన భూమి ఇచ్చేందుకు కూడా అంగీకరించామని, అంతే కాకుండా అప్పుడే ఆ కంపెనీ కర్నూలు జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌కో ప్రాజెక్టులోనూ రూ.4800 కోట్ల పెట్టుబడికి అవగాహన కదుర్చుకుందని ఆయన వెల్లడించారు. ఆర్సెనాల్ మిట్టల్ స్టీల్ కంపెనీ గురించి అంతగా ప్రచారం చేసుకుంటున్న సీఎం చంద్రబాబు, అదే నక్కపల్లిలోని బల్క్ డ్రగ్ పార్క్ ప్రాజెక్ట్ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. అసలు ఆ ప్రాజెక్టు ఏమైందని నిలదీశారు. దురుద్దేశంతో అక్కడ భూవివాదాన్ని సృష్టించిన చంద్రబాబు, దాన్ని ముందుకు సాగనివ్వడం లేదని చెప్పారు. జగన్ 2 లో పార్టీ కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్న శ్రీ వైయస్ జగన్, నియోజకవర్గా ల పెంపు ఒక గుడ్‌న్యూస్ అని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంటు సీట్ల పెంపు హర్షణీయం అన్న ఆయన, దాని వల్ల ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సీట్లు కూడా గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. ఇంకా దాని వల్ల కార్యకర్తలు కూడా నాయకులుగా ఎదిగే అవకాశం వస్తుందని, ఉత్సాహం. పటిమ ఉన్న వారికి ప్రోత్సాహం ఇస్తామని చెప్పారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఏం చెప్పారు? ఆ తర్వాత ఏం చేస్తున్నాడు.. అందరికీ తెలుసు. నాడు ఆయన ఏమన్నాడు. జగన్ ఇస్తున్నవన్నీ అలాగే అమలు చేయడమే కాకుండా, సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ కూడా ఇస్తానన్నాడు. కానీ, ఆ తర్వాత ఏం చేశారు? ఎన్నికలై పోగానే చంద్రబాబు మ్యానిఫెస్టోను చెత్తబుట్టలో వేశారు. ఇప్పుడు మూడు బడ్జెట్లు అయిపోయాయి. ఇంకా మిగిలినవి కేవలం రెండు మాత్రమే. కానీ ఏ పథకం అమలు లేదు. జగన్ ఇచ్చినవన్నీ పోయాయి. అన్నీ ఎగ్గొట్టాడు. చివరకు సూపర్‌సిక్స్, సూపర్‌సెవెన్ కూడా మోసాలయ్యాయి. బిర్యానీ కథ దేవుడెరుగు. ఉన్న పలావు పోయింది. దీన్ని ప్రజలు ఇంటింటా చర్చించుకుంటున్నారు. మన హయాంలో ఆ 5 ఏళ్లలో దాదాపు రూ.3.31 లక్షల కోట్ల అప్పు చేస్తే, అందులో రూ.2.73 లక్షల కోట్లు, డీబీటీ ద్వారా అక్కచెల్లెమ్మల ఖాతాలకు నేరుగా బదిలీ చేశాం. ఆధార్ నెంబర్లు, బ్యాంక్ ఖాతాలతో సహా ఎవరికి, ఎంతిచ్చామో చెప్పగలం. కానీ రెండేళ్లు కూడా కాకముందే చంద్రబాబు చేసిన మొత్తం అప్పులు రూ.3.37 లక్షల కోట్లు దాటాయి. కానీ, జగన్ ఇచ్చిన పథకాలు లేవు. ఇంకా సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ కూడా లేవు. అమరావతిలో చదరపు అడుగు నిర్మాణానికి రూ.11 వేలు ఖర్చు చేస్తున్నారు. బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాల్లో చదరపు అడుగు నిర్మాణానికి రూ.4 వేలతో ఫైవ్‌స్టార్ లెవెల్‌లో కట్టొచ్చు. కానీ ఇక్కడ ఏకంగా అదే చదరపు అడుగు నిర్మాణానికి రూ.11 వేలు ఖర్చు చేస్తున్నారు. ఇంకా భూములు శనక్కాయలు, బెల్లానికి ఇస్తున్నారు. చంద్రబాబు బంధువు, బాలకృష్ణ అల్లుడికి రూ.5 వేల కోట్ల విలువైన భూములు దోచి పెడుతున్నారు. ఈ రకంగా రాష్ట్ర ఆదాయాలు రాష్ట్రానికి రావడం లేదు. చంద్రబాబు పాలనంతా వైఫల్యం. కానీ, మాటలు కోటలు దాటుతాయి. కానీ చేతలుండవు. ఆయన చేస్తున్న దాన్ని క్రెడిట్ చోరీ కాకుండా క్రెడిట్ దోపిడి అనాలేమో. చంద్రబాబు ఇటీవలి క్రెడిట్ దోపిడి గురించి చెప్పాల్సి వస్తే.. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను తాను తెచ్చినట్లు బిల్డప్ ఇస్తూ.. ఆర్భాటంగా జోరుగా ప్రచారం చేసుకుంటున్నాడు.

# ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు.. గంజాయి రహిత జిల్లాగా మారుద్దాం!

ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
నేరాల నియంత్రణకు పటిష్టమైన గస్తీ నిర్వహించాలి
పక్కా ఆధారాలతో నేరస్తులకు శిక్ష పడేలా దర్యాప్తు జరగాలి
రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి.. కేసులపై ఎప్పటికప్పుడు సమీక్ష
రోడ్డు భద్రత కోసం వారం రోజుల పాటు 'అరైవ్ అలైవ్ 2.0' కార్యక్రమం





**వాస్తవ నేస్తం,ఇచ్చోడ :** మండలంలోని ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని, ఆదిలాబాద్‌ను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ (ఐపీఎస్) పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఎస్‌లోని రికార్డులను, నమోదైన కేసుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. నేరాలు జరగకుండా నివారించడానికి, ఒకవేళ జరిగినా వాటిని త్వరితగతిన ఛేదించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్పీ స్పష్టం చేశారు. గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా వీటిని ఏర్పాటు చేసుకునేలా వాటి ప్రాధాన్యతను వివరించాలన్నారు. పోలీసులు గ్రామాలను తరచుగా సందర్శించడం ద్వారా ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని సూచించారు. జిల్లాలో గంజాయి మహమ్మారిని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో గంజాయి వల్ల జరిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పిస్తూ యువతను చైతన్యపరచాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు, ఆర్థిక నేరాలు, దొంగతనాలు జరగకుండా మండలంలో పటిష్టమైన గస్తీ నిర్వహించడంతో పాటు అణువణువూ పర్యవేక్షించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని (అప్‌డేట్) ఎస్పీ సూచించారు. నమోదైన కేసులపై పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించారు. తప్పు చేసిన ప్రతి నేరస్తుడికి చట్టపరంగా కచ్చితమైన శిక్ష పడేలా దర్యాప్తును పక్కాగా కొనసాగించాలని దర్యాప్తు అధికారులకు తేల్చి చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, హెల్మెట్ వాడకం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లావ్యాప్తంగా వారం రోజుల పాటు రోడ్డు భద్రతపై "అరైవ్ అలైవ్ 2.0" పేరిట పలు ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై నారాయణ, మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరిన వాహనదారులు.. 'కొరత' వదంతులతో ట్రాఫిక్ జాం!

కోటగిరి, పోతంగల్ మండలాల్లో పెట్రోల్ కోసం ఎగబడ్డ జనం
కిలోమీటర్ల మేర క్యూలైన్లు.. గంటల తరబడి నిరీక్షణ.. పరిస్థితిని చక్కదిద్దాలని అధికారులకు స్థానికుల విజ్ఞప్తి

**వాస్తవ నేస్తం,కోటగిరి,:** రాబోయే రోజుల్లో పెట్రోల్, డీజిల్ కొరత రాబోతుందంటూ ఒక్కసారిగా వార్తలు గుప్పుమనడంతో కోటగిరి, పోతంగల్ మండలాల్లోని వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇంధనం దొరకదేమోనన్న భయంతో ముందస్తుగా తమ వాహనాల్లో పెట్రోల్ నింపుకునేందుకు బంకుల వద్దకు బారులు తీరారు. దీంతో ఒక్కసారిగా పెట్రోల్ బంకుల వద్ద భారీ రద్దీ నెలకొంది. వాహనాల రద్దీ అమాంతం పెరగడంతో బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూలైన్లు దర్శనమిస్తున్నాయి. వాహనదారులు తమ వంతు కోసం గంటల తరబడి బంకుల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడి, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలావరకు పెట్రోల్ బంకులు ప్రధాన రహదారులకు ఆనుకుని ఉండటంతో, క్యూలైన్ల ప్రభావం ట్రాఫిక్ పై తీవ్రంగా పడింది. వాహనాలు భారీగా రోడ్లపైకి చేరడంతో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇతర పనుల మీద వెళ్లే ప్రయాణికులు, సామాన్య ప్రజలు ట్రాఫిక్ కష్టాలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. కేవలం వదంతుల వల్లే జనం ఇలా ఆందోళన చెందుతున్నారని, అధికారులు




తక్షణమే స్పందించి పెట్రోల్ నిల్వలపై ప్రజలకు స్పష్టతనివ్వాలని స్థానికులు కోరుతున్నారు. బంకుల వద్ద రద్దీని నియంత్రించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పోలీసులకు, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

గమనిక (పత్రిక డిజైనర్‌కు): ఈ వార్తకు బంకుల వద్ద ఉన్న భారీ క్యూలైన్లు లేదా ట్రాఫిక్ జాం అయిన ఫోటోను జత చేస్తే వార్తకు మరింత ప్రాధాన్యత వస్తుంది.

# భానుడి భగ భగలు

**జూలూరుపాడు :** వేసవి కాలం ముందే మొదలైంది మార్చి నెల ప్రధమార్థం నుంచి ఇప్పటివరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉష్ణోగ్రతల నమోదు మండలంలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇప్పటికి 32ఇ, నుండి 33 డిగ్రీలకు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 2-3 అ, అదనంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ నెల లో కనిపించే ఎండ తీవ్రత ఈ ఏడాదిలో మార్చి నెలలో చూస్తున్నాం .ప్రస్తుతం ఎండలు మండుతున్నప్పటికీ రాబోయే కొన్ని రోజుల్లో రాష్ట్రానికి స్వల్ప ఉపశమనం లభించే అవకాశం ఉందని, అలాగే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ప్రభావం ఇంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో వడగాలులు ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఒకవైపు భానుడి సెగలు ఉన్నా కూడా రైతు సోదరులు మిర్చి తోటలలో పనులు నిర్వహిస్తున్నారు. కాలం రాకముందే ఉష్ణోగ్రత ఎక్కువ ఉండటం వలన బయటకు రాలేని పరిస్థితి. కానీ రైతు మాత్రం ఈ ఉష్ణోగ్రతను లెక్కచేయకుండా పండించిన పంటను పూర్తి న్యాయం చేస్తున్నారు. రైతుల పట్ల భానుడు కనీసం కనికరం చూపని పరిస్థితి. మండలంలో 24 గ్రామపంచాయతీలు, ప్రతి పంచాయతీ వ్యవసాయేతర రైతులు కలిగి ఉన్నారు. ఒకవైపు ఎండలు మండుతున్న



లెక్కచేయకుండా పనులు నిర్వహించడం, అలాగే పనుల కంటే ప్రాణం విలువ ఎక్కువ కాబట్టి జూలూరుపాడు మండల పరిధిలో ఉన్న 24 గ్రామ పంచాయతీల రైతు సోదరులు అప్రమత్తంగా ఉండి, భానుడి సెగలనుండి బయటకు పడవలసిందిగా మండలంలో ఉన్న కొంతమంది భావిస్తున్నారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా నిలిచిన డాక్టర్ సితలే రమేష్, గ్రామ పెద్దలు



**వాస్తవ నేస్తం,కోటగిరి :** పోతంగల్ గ్రామ సమీపంలో 12 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డప్పు గంగాధర్ అనే యువకుడిని ఆదుకునేందుకు మానవత్వం పరిమళించింది. ఏడాది వయసున్న కూతురు, భార్య ఉండి, వైద్య ఖర్చులకు సైతం ఇబ్బంది పడుతున్న గంగాధర్ దీనస్థితిని చూసి గ్రామ సర్పంచ్ భాస్కర్, ఈశ్వర్, మరియు విశ్వనాథ్ కలిసి డాక్టర్ సితలే రమేష్ దృష్టికి తీసుకెళ్లారు.దీనికి స్పందించిన రమేష్ తన వాట్సాప్ స్టేటస్ ద్వారా విరాళాలు సేకరించగా, రూ. 25,500 జమ అయ్యాయి. సేకరించిన ఈ నగదును నేడు ఆసుపత్రిలో బాధితుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సితలే రమేష్, సర్పంచ్ భాస్కర్, జంగం శివ కుమార్, దుర్కి గోపాల్, డుక్రీ భజరంగ్, ఈశ్వర్, సందీప్, నేరడి రవి తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ అవార్డ్స్‌లో స్కాం...!

### రెండు కోట్లకు టెండర్... నాలుగు కోట్ల ఖర్చా...

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గద్దర్ అవార్డుల కార్యక్రమంలో కుంభకోణం జరిగిందా.. కోట్ల రూపాయలు దారి మళ్లాయా? ఇందులో ఇష్టారాజ్యంగా వ్యవహరించారా.. ముందుగా అనుకున్న దానికంటే.. ఎక్కువ ఖర్చు పెట్టారా.. ఇందులో ఎవరి పాత్ర ఎంత.. ఇప్పుడు ఇవే విషయాలను బయటపెట్టారు గులాబీ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్.గద్దర్ అవార్డుల పేరుతో తెలంగాణ ప్రభుత్వం అడ్డగోలుగా ఖర్చు చేసిందని శ్రవణ్ ఆరోపించారు. తెలంగాణ సంస్కృతిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. జ్యూరి సభ్యులను.. సినీ పెద్దలను అవమానించారని విమర్శించారు.. విచ్చలవిడిగా ఖర్చుపెట్టిన వ్యవహారంపై ప్రభుత్వం నోరు విప్పాలని.. ఎఫ్ డీ సీ చైర్మన్.. సంబంధిత మంత్రిపై చర్యలు తీసుకోవాలని శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈనెల 19న హైటెక్స్ లో తెలంగాణ ప్రభుత్వం గద్దర్ ఫిలిం అవార్డులను అందజేత కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను విజ్ క్రాఫ్ట్ అనే ముంబైకి చెందిన కంపెనీకి అప్పగించింది. అయితే అందులో ఉన్న లెక్కలకు సంబంధించిన ఓ కాపీ బయటికి వచ్చింది. దీనిని శ్రవణ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అవార్డుల ఫంక్షన్ లో శ్రేయ ఘోషల్ కు 1,65,00,000, దేవిశ్రీప్రసాద్ కు 60,00,000, దేవిశ్రీప్రసాద్ టెక్ రైడర్ కు 20,00,000, నిధి అగర్వాల్ కు 20,00,000, లివ బీనిఎవజీబిజీఎశ్రీవ (బజూవఇతిజీశ్రీ జీఇబి) 10,50,000, ఇశ్రీజీబబతిఇజీశ్రీ జీఇబి 6,50,000, వ్యాఖ్యాతలు సుమ, ప్రదీప్ కు 13 లక్షలు, కొరియోగ్రఫీ చేసిన వారికి 39,20,000, కాస్ట్యూమ్స్ కు ఐదు లక్షలు.. ప్రయాణానికి.. బస, భోజనాల ఖర్చుకు 60 లక్షలు.. రెడ్ కార్పెట్ యాంకర్లకు ఏడు లక్షలు.. హెయిర్.. మేకప్ వేసిన వారికి ఐదు లక్షలు.. మొత్తం ఆర్టిస్టుల ఖర్చు నాలుగు కోట్ల 11 లక్షల 20,000 బిల్లు అయింది.. వేదిక.. లైటింగ్.. ఇతర ఖర్చులకు భారీగా వెచ్చించారని శ్రవణ్ ఆరోపించారు. ఇక ఇదే డాక్యుమెంట్లో టెండర్ కాస్ట్ కాలంలో రెండు కోట్ల 13 లక్షలని ఉందని.. అయితే అసలు బిల్లు మాత్రం నాలుగు కోట్ల 11 లక్షల ఇరవై వేలని.. అనుకున్న దానికంటే రెండు కోట్లు అదనంగా ఖర్చు పెట్టారని శ్రవణ్ ఆరోపించారు. ఈ అదనపు ఖర్చును ఎఫ్డిసి చైర్మన్ లేదా సినిమాటోగ్రఫీ మంత్రి భరిస్తారా అని శ్రవణ్ ప్రశ్నించారు. విజ్ క్రాఫ్ట్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చిన వ్యక్తులు ఎవరని.. తెలంగాణ ప్రాంతంలో ఎటువంటి ఏజెన్సీలు లేవా.. దీనికి ఏమైనా ఓపెన్ టెండర్లు పిలిచారా.. లేదా ప్రభుత్వం తమకు కావలసిన వారికి కట్టబెట్టిందా అని.. శ్రవణ్ ప్రశ్నించారు. తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు అలానే ఉండిపోయాయని.. కానీ ఒకరోజు ధూంధాం వేడుకకు నాలుగు కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని శ్రవణ్ ప్రశ్నించారు.

## జమ్మికుంటలో జెపీఎల్ సీజన్-3 ప్రారంభం

### యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

**జమ్మికుంట :** జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో జమ్మికుంట ప్రీమియం లీగ్ (జెపీఎల్) సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను మున్సిపల్ ఛైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, క్రీడాకారులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఛైర్మన్ ప్రశాంత్ కుమార్ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావనను పెంచుతాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలని, తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలని సూచించారు.ఇలాంటి టోర్నమెంట్లు స్థానిక ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అన్ని జట్లు క్రీడాస్ఫూర్తితో పోటీ పడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్ దిడ్డి కోమల, దిడ్డి రాము, మాచెర్ల రాజు, కందాల రాము, శ్రీనివాస్, రాము, క్రీడాభిమానులు, యువత పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో విపత్తు నిర్వహణ శిక్షణ శిబిరం

**కరీంనగర్:** తొమ్మిదవ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన యువ ఆపద మిత్ర పథకం శిక్షణ శిబిరంలో భాగంగా విపత్తు నిర్వహణపై అవగాహన కార్యక్రమం జరిగింది.విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ ఏ.కే. జయంత పాల్గొని కెడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. విపత్తు నిర్వహణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, అప్రమత్తతతోనే ప్రాణనష్టం, ఆస్తినష్టం తగ్గించవచ్చని తెలిపారు.విపత్తులు ఎప్పుడు, ఎక్కడ సంభవించినా తక్షణ స్పందనతో సహాయక చర్యలు చేపట్టాలని, అవసరమైన వనరులను సమకూర్చి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ఈ అంశంపై అవగాహన కలిగిన వారు ఇతరులకు తెలియజేస్తూ సమాజంలో చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు.కెడెట్లకు ప్రాయోగికంగా శిక్షణ ఇచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు నిర్వహించారు. విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలను ప్రత్యక్షంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. కెడెట్లు ప్రదర్శించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.జిల్లా అగ్నిమాపక అధికారి రాజ్‌కుమార్, ఏఎస్ఐ మహేందర్, డీవీఆర్ ఆపరేటర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చివరగా విపత్తు సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని ప్రతిజ్ఞ చేయించారు.

## బీరంగూడలో హైడ్రా కమిషనర్ పర్యటన

**రంగారెడ్డి :** అమీన్పూర్ మండలం బీరంగూడ విలేజ్లోని సర్వే నంబరు 996, 997లో ఉన్న ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన లే ఔట్ను ఆక్రమించుకుని కొంతమంది 100 గజాల చొప్పున అమ్మేస్తున్నారని సొసైటీ ప్రతినిధులు చేసిన ఫిర్యాదును హైడ్రా కమిషనర్ బుధవారం పరిశీలించారు. 1982లో వేసిన లే ఔట్లో పలు సంస్థల్లో పని చేసిన ఉద్యోగులు ప్లాట్లు కొనగా.. ఇప్పుడవి అన్యాక్రాంతం అవుతున్నాయని వాపోయారు. 180 ఎకరాలలో దాదాపు 1650 ప్లాట్లతో లే ఔట్ వేసినట్టు రికార్డులు చూపించారు. లే ఔట్లలో పార్కులు, రహదారులను కాపాడాలని కోరారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com